తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# కర్తవ్యం

ఎ.వి.వి.యస్.నారాయణ

రోహిణికార్తె చివరి రోజులు.

పశ్చిమాకాశపు సింధూరం ధూమంలోకి మారుతున్నా ఎండ సెగ తగ్గలేదు. వేడిగాలి చెంపల్ని కాల్చేస్తూ మనిషిని ఆర్పేస్తున్నాది. దానికి తోడు ఆ ఊరి చివర గవర్నమెంట్ ఆఫీసులో పనంటే మరీ ఇబ్బంది. అప్పటికే రెండ్రోజుల్నించి ఆ ఎండల్లో ఆ ఆఫీసుకి తిరుగుతున్నా అతని పని అవడం లేదు— షరా మామూలే అన్నట్టు సర్కారు వారి చేతులు తడుపుతున్నప్పటికీ!

ఆ రోజు కూడ తన పని అవదని నిర్ధారణ ఐపోయిన తరువాత అసహనంగా ఆ ఆఫీసు గదినొదిలేశాడు. ఎక్కడ లేని నీరసం ఆవహించే సరికి ద్వారం బయట వున్న చిన్న బెంచీ మీద కూలబడ్డాడు. మళ్ళా ఏం అనుమానమొచ్చిందో ఏమో వెంటనే అక్కడ్నుంచీ లేచిపోయాడు. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. నాలిక పిడచ కట్టుకుపోతోంది. "వెధవది ... తను అందరి చేతులూ తడపడమే కన్పిస్తూంది కానీ తన గొంతు తడపడానికి నీళ్ళెక్కడా కన్పించడం లేదు!" విసుక్కున్నాడు. ఓ నలుగురిని కనుక్కున్న తర్వాత వచ్చింది సమాధానం. "ఈ బిల్డింగెనకాలపాతాఫీసుబిల్డింగునేదండీ,అందులో కుడేపు సివార గదిలో ఉంటాయండీ మంచి నీళ్ళు" 'థ్యాంక్సురా బాబూ' అనుకుని కాళ్ళీద్చుకుంటూ బయల్దేరాడు.

బ్రిటిష్ వాళ్ళ కాలంలో కట్టించిందికాబోలు చాల చల్లగా వుందనిపించింది. అందులో మూలనున్న కుండలో నీళ్ళు పక్కనే నీదీ నాదీ జన్మజన్మల బంధం అన్నట్టు సన్నటి ఇనుప గొలుసుతో ఆ కుండకి కట్టేసి వున్న లొత్తల సిల్వర్ గ్లాసులో ఒంపుకున్నాడు. అడుక్కి వచ్చినట్టున్నాయి,నీళ్ళలో ఏవో పరాయి పదార్థాలు కనిపించాయి. అతని సహనాన్ని సర్కారు వాళ్ళకెప్పుడో తాకట్టు పెట్టేశాడు. కళ్ళు మూసుకుని గ్లాసు ఖాళీ చేసి బయట పడ్డాడు.

బస్టాపు వైపు గబగబా అడుగులు వేస్తున్నాడు. తనలాగే ఆ ఆఫీసుతో పనున్న దురదృష్టవంతులు, ఆ ఆఫీసు స్టాఫ్ కొందరు అక్కడున్నారు.

ప్లాస్టిక్ హేండ్ బ్యాగ్‌లు, ఖాళీ టిఫిన్ బాక్సులు, గుడ్డ సంచీలు, పాత ఫైళ్ళు, గొడుగులు, చేతి కర్రలు. పీత కష్టాలు పీతవన్నట్టు ప్రతి ఒకడూ యథాశక్తి ఏదో బరువు మోస్తున్నాడు.

మూడు రోడ్ల జంక్షన్ అది. అప్పుడప్పుడు ఏవేవో సిటీ బస్సులొస్తున్నాయి. ఎవరూ దిగడం లేదు కాని రెండో మూడో శాల్తీలు మాత్రం ఎక్కుతున్నాయి.

వాచీ చూసుకున్నాడు కృష్ణ. అప్పుడే పావు గంటయింది అక్కడి కొచ్చి. తనెక్కాల్సిన బస్సుఇంకా రాలేదు. సందె చీకట్లు కమ్ముతున్నాయి. జనం కూడా పల్చబడుతున్నారు.

ఏదో బస్సొచ్చి అక్కడాగితే యథాలాపంగా చూసాడు కృష్ణ. కండక్టర్ నాలుగు సామాన్లు దించిన తర్వాత ఓ ముసలతను దిగాడు గొడుగుని చేతికర్రలా పట్టుకుని. అక్కడున్న వాళ్ళు తనివి మదురు, కళ్ళు చిట్లించి అదో మాదిరిగానూ, ఆశ్చర్యంగానూ చూశారు. రెండు సిల్వర్ క్యాన్లు, నాలుగు పక్కలా తాడుతో కట్టిన ఓ అట్ట డొక్కు, ఓ పక్క తాళం ఊడిపోయిన పాత లెదర్ సూట్‌కేసూ. ఇన్ని సామాన్లతో ఓ పక్క చీకటి పడుతూంటే ఇక్కడ దిగేడేవిటీ ముసలతను అని ఆశ్చర్యపోయాడు కృష్ణ.

ఎవరైనా ఓ చెయ్యి వేస్తారేమోనని ఓ రెండు క్షణాలు చూశాడు ముసలతను. "పరోపకారి పాపన్న వచ్చాడ్రా" అని ఎవరైనా ఎగతాళి చేస్తారేమోనన్న సూడోషైనెస్ వల్ల కాబోలు అక్కడున్న వాళ్ళెవరూ ముందుకు వెళ్ళకపోయే సరికి అతనే ఆయాస పడుతూ ఆ సామాన్లని బస్ షెల్టర్ దగ్గరకి చేరేశాడు రెండు సార్లు తిరిగి.

తన జడత్వానికి గిల్టీగా ఫీలయ్యాడు కృష్ణ.

ఆ ముసలతను షెల్టర్ క్రింద చతికిలబడుతూ పక్కనే నిలబడి వున్న కృష్ణని "నాయనా గాంధీనగరం వెళ్ళే బస్సు ఇక్కడికి వస్తుందా" అనడిగాడు.

"ఆ ... వస్తుంది. నేను కూడ ఆ బస్సు కోసమే చూస్తున్నాను. వచ్చినప్పుడు చెబ్తాన్లెండి" అన్నాడు అతని పక్కనే రుమాలు పర్చుకుని కూర్చుంటూ.

"హమ్మయ్య ఏదో దేవుడిలాగ తోడు దొరికావు." తృప్తిగా నిట్టూర్చాడా ముసలతను.

"చీకటిపడుతోందో పక్క. చూపు కూడా సరిగ్గా ఆనడం లేదు. ఇంటికెలా వెళ్తానో అన్న భయం పట్టుకుంది."

"అయినా ఇన్ని సామాన్లతో ఈ టైములో బయల్దేరారేవిటి."

ముసలతనోసారి నిట్టూర్చాడు. "ఏం చెప్పమంటావ్ నాయనా! అప్పటికీ ఓ నాల్రోజుల ముందర ఉత్తరం రాసాను అల్లుణ్ణి స్టేషన్‌కి రమ్మని. మరా ఉత్తరం అందిందో లేదో, అతను ఊళ్ళో ఉన్నాడో లేడో, స్టేషన్ కెవరూ రాలేదు. ట్రైన్ రావడం మూడు గంటలకే వచ్చేసింది. అయితే ఎవరైనా వస్తారేమోనని దాదాపు గంటసేపుఅక్కడే కూర్చున్నాను. ఎవరూ రాకపోయే సరికి—ఇహ లాభం లేదు మనవే ఏదోలా వెళ్ళాలనుకుని బయల్దేరాను." కొద్దిసేపు చెప్పడం ఆపి మళ్ళా అన్నాడు. "కొత్త ప్రదేశం కదా ఈ

ఆటోలు అవీ మరెందుకు! నలుగురూ సాయంగా ఉంటారు కదాని బస్సులో బయల్దేరితే ఈ వేళయింది మరి...''

వేమవలా నవ్వుకున్నాడు కృష్ణ. ''సాయంగా ఉంటారు కదాని!'' మళ్ళీ వినిపించిందతనికి.

''...మొన్న ఉగాదికి బట్టలు పెట్టలేదని అల్లుడు గారు విసుక్కున్నారని రాసిందమ్మాయి. మరి కొత్తల్లుడు కదా! ఆ విసుగు చిరాకు భరించాల్సిందే! మరప్పుడు కుదిరింది కాదు ఏవో ఇబ్బందులవల్ల. అందుకే కొంచెం ఆలస్యమైనా ఇప్పుడు దానికో రెండు చీరలు, అతనికి రెండు జతల బట్టలు పట్టుకెళ్తున్నాను. వాళ్ళమ్మ కూడా తిండానికేవో చేసిపెట్టింది.''

ఒక్కసారి ఊపిరి పీల్చుకుని మళ్ళీ ''ఏం చేస్తాం నాయనా! అభిమానాల్ని, ఆప్యాయతల్ని డబ్బుతోటీ, వస్తువుల తోటీ కొలవడం అలవాటయిపోయింది మనకు. ఏవంటావ్'' అన్నాడు.

మౌనంగా తలూపాడు కృష్ణ. పూర్వపు విలువల్ని కాపాడలేక నేటి మార్పులతో రాజీ పడలేకసతమతవుతోన్న ఆ తరం వ్యక్తి అలా తేట తెల్లంగామాట్లాడుతుంటే అతనికి తనేదో దగ్గర బంధువైనట్టనిపించింది.

ముసలతనన్నాడు ''నీకు ఉద్యోగం అదీ..!''

''చేస్తున్నాను''

''ఎంతిస్తారో''

చెప్పాడు.

''మరి పెళ్ళీ అదీ''

''అబ్బే ఇంకా లేదు'' చిన్నగా నవ్వుతూ అన్నాడు.

''అయ్యో అదేవిటయ్యా! అన్నిహంగులుండి కూడ ఇంకా పెళ్ళి చేసుకోక పోతే ఏం బావుంటుందీ'' అని, వెంటనే, ''ఏం అక్కలు, చెల్లెళ్ళు కాని ఉన్నారా పెళ్ళికి'' అన్నాడు.

''అదేం లేదు. అన్ని లైన్లూ క్లియరే''

''అయితే నిన్నసలు క్షమించకూడదు.''

ఓ పరాయి వ్యక్తి తన వ్యక్తిగత విషయంలో తనని చనువుగా మందలించేసరికి నిజంగానే ఏదో హిమాలయన్ బ్లండర్ చేసేసినట్టనిపించిందతనికి.

కొంతసేపు నిశ్శబ్దం. వాచీ చూసుకున్నాడు కృష్ణ. నలభై నిమిషాలవుతోంది తనొచ్చి. ఏ బస్సొస్తే అది పట్టుకుని అక్కడున్న వారందరూ వెళ్ళిపోయారు. అక్కడ మిగిలింది తామిద్దరే డైరెక్ట్ బస్సు కోసం వెయిట్ చేస్తే బాగా ఆలస్యం అయిపోయిందే అనుకుంటూ లేచి రోడ్డు కనిపించినంత వరకు చూశాడు. ఏదో మోపెడ్ వస్తోంది. కానీ బస్సు జాడలేవీ లేవు.

అయితే అల్లంత దూరం నుంచే మోపెడ్ మీద వ్యక్తి తన వైపు చెయ్యి ఊపడంతో సంశయంగా చూశాడు. ఓ నాలుగడుగులు ముందుకేసి ఆ వ్యక్తిని చూసి నవ్వుతూ ''ఓరీ, నువ్వా, ఎవరో అనుకున్నాను.'' అన్నాడు.

మోపెడ్ ఆపుతూ మూర్తి ''అనుకుం టావ్‌రా అనుకుంటావ్'' అన్నాడు చిరుకోపాన్ని అభినయిస్తూ.

''అదిసరేగాని, ఒరేయ్ దీన్ని మోసుకొస్తున్నావేవిటి? వాళ్ళే తీసుకొస్తారు కదరా'' అన్నాడు కృష్ణ మోపెడ్ వెనకాల కట్టేసి ఉన్న గ్యాసు సిలండర్‌ని చూపుడు వేలుతో కొడుతూ.

''తీసుకొస్తార్రా, కానీ ఇవాళ అర్జంటయి తేనా'' అని ''నువ్వు ఇంటికే కదూ''అన్నాడు.

''ఆ''

''అయితే ఎక్కు ఇంకా ఆలస్యం దేనికి''

కృష్ణ యాంత్రికంగా ఎక్కేశాడు..

''ఎలాగోలాగ ఎడ్జస్టవు. ఆ సిటీ






బస్సులన్న ముక్కుంటే ఇహ అంతే! సరిగ్గా కూర్చున్నావా?''

''ఆ...ఆ,..''

మోపెడ్ కదిలింది.

ఓ వంద గజాలు వెళ్ళారో లేదో ఛెళ్ళున ఎవరో చరిచినట్టు తెప్పరిల్లి ''ఒరేయ్ ఆపోసారి, నేను దిగాలి'' అన్నాడు కృష్ణ.

''ఏంరా అప్పుడే చిటికిన వేలా''

''చిటికిన వేలు కాదూ, బొటన వేలూ కాదు . నువ్వెళ్ళు నేను బస్సు మీద వస్తాను'' అన్నాడు దిగుతూ.

మూర్తికి కృష్ణ ధోరణేం అర్థం కాలేదు. ''ఏవి(టా నీకేవన్నా (స్క్రూ లూజా? ఆ సిటీ బస్సులూ అవీ ఎప్పుడొస్తాయో, ఇంటి వరకూ దిగబెడతా(నా బాబూ అంటే చేదా? అయినా అసలెందుకు రానంటున్నావ్? దీని మీద సుఖంగా లేదనా?''

''అబ్బ అదేం కాదు కానీ నువ్వెళ్ళు, నేను బస్సులో వస్తాను కదా!''

మూర్తి ఓసారి కృష్ణని ఎగాదిగా చూసి ''సరే, నీ కర్మ... వస్తా'' అంటూ బయల్దేరాడు.

కృష్ణ గబగబా బస్టాప్ వైపు అడుగులు వేస్తున్నాడు.

కుడి చేత్తో దానం చేస్తే ఎడం చేతికి తెలియకూడదట. అలా చేస్తేనే తృప్తి వుంటుందేమో. గబగబా అడుగులు పడ్తున్నాయి.

''హమ్మయ్య, ఏదో దేవుడిలాగా తోడు దొరికావు'' ముసలతని మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. అప్పుడా వృద్ధుని ముఖంలోని వెలుగునీ, తృప్తినీ తను మర్చిపోగలడా?

బస్టాప్ దగ్గరవుతూంది.

ఉదయిస్తున్న పౌర్ణమి చం(దుని వెలుగులో అక్కడున్న ముసలి వ్యక్తి కవళికలు అస్పష్టంగా గోచరిస్తున్నాయి.

